

# ది గైడ్ డాగ్

నా భార్యకు ఆరాత్రే ఉత్తరం రాశాను.

ముప్పైమూడో వీధిలో నడుస్తున్నాను. ఎదురుగా ఒక నీగ్రో వస్తున్నాడు. అల్సేషన్ ఒకటి అతని ముందు నడుస్తున్నది. అతను దాని మెడకు కట్టిన గొలుసు పట్టుకున్నాడు. ఆ కుక్క అతనిని నడిపించుకుపోతున్నది. "గైడ్ డాగ్‌ను కొనుక్కోడానికి సహాయం చేయండి"- అతని మెడలో వ్రేలాడుతున్న అట్టమీద రాసి ఉంది.

*గండికోట బ్రహ్మాజీరావ్*

దారినిపోతున్నవాళ్ళు తమకు తోచినది అతని చేతిలోనున్న డబ్బాలో వేస్తు న్నారు. రోడ్డు సిగ్నల్స్ చూచి ఆ కుక్క ఆగిపోయింది. తరువాత అందరూ సిగ్నలు చూచి నడుస్తుంటే ఆ అంధుడిని క్రాసింగ్ దాటించింది. న్యూయార్క్ నగర వీధులను సునాయా సంగా దాటిస్తున్న కుక్కను చూస్తే చాల ఆశ్చర్యం కలిగింది. నా స్నేహితుడి దగ్గిర మంచి అల్సేషన్ ఒకటి ఉంది. అతను తప్పకుండా ఇస్తాడు. రామ్‌లాల్‌కి ఈ కుక్క ఎంతో పనికొస్తుంది. అందరికి మల్లే వాడు కూడా సాయంకాలం మంచి బట్టలు వేసుకొని షికారు పోయివస్తాడు. వాడి ఆరోగ్యం చాలా బాగుంటుంది ఈ విషయమే నా భార్యకు రాశాను.

ఈ రాంలాల్ ఎవడంటారా!

రమారమి పన్నెండు సంవత్సరాల క్రితం....మా బంధువు ఒకాయన అసన్ సోల్‌నుండి రామ్‌లాల్‌ని ఆంధ్ర దేశం తీసుకొచ్చాడు. మాకు అప్పటికి హిందీ రాదు. వాడికి తెలుగు రాదు. కూలిపని చేస్తుండేవాడు. అప్పటికే వాడికి ముప్పై యేళ్ళు దాటాయి. పెళ్లి పెటాకులులేవు. బంధువులు ఎవరున్నారో ఎవరు లేరో తెలియదు వాళ్ళగురించి ప్రశ్నిస్తే నవ్వి ఊరుకునేవాడు. వాడికెవడో అన్న ఉండేవాడు. కొంతకాలం వాడికి డబ్బు పంపించేవాడు. ఆ తరువాత అదీ లేదు. ఈ విషయాలు నా కెలా తెలిశాయని అడగవచ్చు. వాడి అన్నకి డబ్బు పంపే టప్పుడు మని అర్డరు ఫాము నేనే నింపే వాడిని తరువాత తరువాత డబ్బు నా చేతికే ఇచ్చేవాడు.

వాడు మావూరు వచ్చిన మొదటి దసరా పండుగకి పిల్లలందరికీ మిఠాయి కొని తెచ్చాడు. గాఢమైన రంగులు మెతకనూనె కంపు ... ఆ మిఠాయి ఎవరం తినలేకపోయాం. ఆ తరువాత పండుగకి మంచి దుకాణంనుంచే తెచ్చాడు. కాని మాలో కొంతమంది మైసూర్‌పాక్ వేలువేసి ముట్టలేదు. మూడో ఏడునుంచి డబ్బులు నా చేతిలో పోసి ఎవరెవరికి ఏవేవి కావాలో కనుక్కొని కొనిపెట్ట మనేవాడు. మాతోపాటు తనూ ఒక ముక్క నోట్లో వేసుకునేవాడు.

ఉన్నట్లుండి వాడు కనిపించడం మానేశాడు. రాజమహేంద్రవరం వెళ్ళి నట్లు తెలిసింది. అక్కడ వాడు ఇంజను డ్రైవర్ల పెట్టెలు మోస్తుండేవాడట. ఎందుకు వాడు వెళ్ళిపోయాడో నాకు తెలిసింది కాదు

నా చదువయిపోయింది. ఉద్యోగం దొరికింది. పెళ్ళయి అప్పుడప్పుడే స్థిర పడుతున్నాను.

ఒకనాడు పొద్దున్న వీధితలుపెవరో తట్టారు. బద్ధకంగా లేచి తలుపు తీశాను. రిక్షా దిగి ఒక మనిషి గుమ్మం దగ్గిర నిలబడ్డాడు. వాడి మెడలో సిగ్నల్ లాంతరొకటి వేలాడుతున్నది. పొట్టి

వికర్ తొడుక్కున్నాడు. మాసిన కోటు వేసుకున్నాడు. రిక్షావాడి చేతిలో అడ్రస్ కాగితముంది. రిక్షాలో చిన్న పెట్టె ఉంది వాడు రామ్‌లాల్.

నిర్ఘాంతపోయాను.

బొగ్గుముక్క తగిలి వాడికి ఒక కన్ను పోయింది. రెండు సంవత్సరాల క్రిందే నాకీ సంగతి తెలిసింది. ఇప్పుడు రెండో కన్ను కనిపించడం మానేసింది. కన్ను బాగుచేయించుకోడానికి వాడు విశాఖ పట్నం వచ్చాడు.

బాబుగారింటకి "వెళ్ళావా?" ప్రశ్నించాను. ఆ బాబుగారు వాడిని మొట్ట మొదట తీసుకొచ్చినవారు.

"వెళ్ళాను. ఆయనే ఈఅడ్రస్ ఇచ్చి వెంటనే పంపించారు" అన్నాడు వాడు.

ఏమనాలో నాకు తోచలేదు.

"బాబా! నీకు వీలుకాకపోతే నే నెవరి దగ్గరికి పోను! కన్ను వస్తుందన్న ఆశ ఇంకా పోలేదు. నీకు చాలామంది డాక్టర్లు తెలుసట. అందుచేత నీ దగ్గిరికి పొమ్మని బాబుగారన్నారు."

ఏదో జవాబు చెప్పుకోవాలనుకున్నా చెప్పలేకపోయాను.

"డాక్టర్లకి, మందులకి చాల ఖర్చవు తుంది. అది నాకు తెలుసు. మొదటి కన్ను పోయినప్పుడే డాక్టరు చెప్పాడు రెండో కంటికి కూడా చికాకు వస్తుందని. అప్పటినుంచి డబ్బువెనకవేస్తూ వచ్చాను. ఎంత జాగ్రత్తపడినా నాలుగయిదు వందల కన్న మిగల్చలేకపోయాను. అక్కడవాళ్ళంతా విశాఖపట్నం అస్పత్రిలో చేరితే అపరేషను చేస్తారని చెప్పారు. నీకు ఇబ్బంది అవుతుందేమో నని బాబుగారి దగ్గరికే రైలు దిగగానే వెళ్ళాను. కాని ఆయన వీధిగుమ్మం లోంచే, వచ్చిన రిక్షాలోనే నీ దగ్గరికి పంపించారు.... ఇప్పుడు నువ్వా కాదంటే...."

నాకు పౌరుషం పుట్టుకొచ్చింది.

"అవును! నువ్వు నావాడివే! ఎవ రయినా నిన్ను పొమ్మంటారు, కాని నే నా మాట అనలేను. నిన్ను అస్పత్రిలో చేరుస్తాను....నీకు తప్పకుండా చూపు వస్తుంది!" ఆవేశంతో అన్నాను వాడి పెట్టె యింట్లో పెడుతూ.

మరునాడు సెలవుపెట్టి రామ్‌లాల్‌ని ముందు కళ్ళ సర్జనుగారింటికి తీసుకొని వెళ్ళాను. వాడిచ్చిన అయిదువందల రూపాయలు నా జేబులో ఉన్నాయి. అందుచేత డాక్టరు ఫీజు ఏ కష్టంలేకుండా చెల్లించాను. తరువాత కాఫీ హోటలుకి వెళ్లాం. వాడిని అస్పత్రిలో చేర్పించాను. గుమస్తాలు, అయాలు, నర్సులు, డాక్టర్లూ....అందరికీ చిన్న చిన్న బహు మతులు, అల్పాహారాలు....అది వాడి డబ్బు. విచ్చలవిడిగా ఖర్చు పెట్టే అవకాశం నాది.

అస్పత్రిలో రామ్‌లాల్ పరిస్థితి చాల మెరుగయింది. నెత్తురు పరీక్ష చేశారు.

శుభ్రమైన పక్క - భోజనం కూడా అక్కడిదే. టిఫిన్ తేవడానికి ఒక కుర్రాడిని కుదిర్చాను, కాల్యాలుతీర్చుకో డానికి, స్నానం చేయడానికి ఏర్పాట్లు చాలా బాగా ఉన్నాయి.

"బాబా! నువ్వు రోజూ రాలేక పోతున్నానని విచారించడ మెందుకు? ఎవరో ఒకరు సాయంచేస్తున్నారు. కాలం ఎలా గడుస్తున్నదో నాకే తెలియడం లేదు," అన్నాడు వాడొకనాడు రాలేక పోయినందుకు నేను విసుక్కుంటుంటే.

చుట్టుపక్కలనున్న రోగులు కూర్చొని కబుర్లు చెప్పుకునేవారు. ఎవరూ లేకుండా ఉంటే చుట్టలు, బీడీలు కాల్చుకునేవారు.

చేరిన పదిరోజులకి రామ్‌లాల్‌కి ఆపరేషను అయింది, మరో మూడు వారాలకి కన్ను పూర్తిగా మానింది. కాని చూపు మాత్రం రాలేదు. అప్పటికప్పుడే మూడువందలు ఖర్చయాయి. వాడిని ఎక్కడికి తీసుకుపోవడానికి, ఏమి చెయ్యడానికి తోచలేదు. ఆస్పత్రిలో వాడికి సదుపాయంగా ఉంది. గుమస్తాలను, డాక్టర్లను బ్రతిమాలి మరొక్క నెల రోజులు వాడిని అక్కడ ఉంచేసరికి దేవుడు దిగి వచ్చాడు.

అనుకున్న రోజు రానే వచ్చింది. ఆస్పత్రినుండి ఇంటికి తీసుకెళ్ళడానికి వాడి డబ్బు రిక్షా ఖర్చుకైనా మిగల లేదు. వాడిని ఇంటికి తీసుకొచ్చిన దగ్గరినుండీ అన్నీ సమస్యలే. విశాఖ పట్నంలో అద్దె ఇళ్ళలో ఉండేవారికి మరొక మనిషి వస్తే ఇబ్బంది తప్పదు. అదృష్టవశాత్తు మా యింటికి వీధివైపు అరుగొకటి విశాలమైనది ఉంది. అది రామ్‌లాల్‌కి నివాసమయింది.

ఆ రాత్రంతా భార్యాభర్తలం ఆలో చించాము. రామ్‌లాల్ ఎవరికి అక్కర లేదు. వాడు కాయకష్టంచేసి డబ్బు సంపాదించినప్పుడు అందరూ అనుభ వించారు. ఇప్పుడందరూ తలుపులు మూసుకుంటున్నారు. వీ డె క్క డి కి పోతాడు? వాడికున్న ఒక్క అన్న కూడా ఎప్పుడో చచ్చిపోయాడు. ఏంచెయ్యడం! ....ఏంచెయ్యడం!!....ఏంచెయ్యడం!!!

ఒకటి మాత్రం నిజం. వాడిని పోషించవలసిన బాధ్యత మామీద పడింది. ఎవరిని నిందించినా ప్రయోజనం లేదు. ఏ విధంగా కర్తవ్య నిర్వహణ జరపాలో ఆలోచించాలి మరొక దారి లేదు.

రోజూ పొద్దున్నే లేచి వాడిని కాల్యాలకోసం రైలు పట్టాల వేపు తీసుకొనిపోయేవాడిని. రోజూ మధ్యాహ్నం నూతి దగ్గిర స్నానం చేయించేవాడిని. వాడి పక్క దులిపి, బాగా శుభ్రంచేసి స్నానం చేయించే వాడిని. భోజనం పెట్టడం మొదలైనవి నా భార్య చేసేది. ఇవన్నీ తప్పనిసరి అయినవి.

కాని....ఏంచెప్పడం....వాడు ఉదాసీనంగా ఉండేవాడు. వాడికి అన్ని సంగతులు తెలుసు. నొచ్చుకునేవాడు. నిస్సహాయంగా మా మీదనే ఆధారపడుతున్నందుకు చాల విచారించేవాడు. జీవితమంటే భోజనం చేయడం, నిద్రపోవడము మాత్రమే కాదు ఏంచేయాలి? .. మరెవ్వరూ అంత చనువుగా చెయ్యలేరు. రాత్రిపూట బీడీలు కొని తెచ్చి, కొంచెం దూరంలో కూర్చొని వాడితో కబుర్లు చెప్పేవాడిని. వాడికి తెలిసినవాళ్ళ సంగతులు చెప్పేవాడిని. వాడి జీవితంలో అడుక్కుపడిపోయిన జ్ఞాపకాలను పునశ్చరణ చేయించేవాడిని.


ఈ అనుబంధం పెరిగింది.

మా తమ్ముడికి పెళ్ళయింది. వాడి భార్య కూడా మా బంధుకోటి లోనిదే. చిన్నప్పుడు ఆ పిల్లను రామ్‌లాల్ ఎత్తుకొని ఆడించేవాడు. డబ్బులిచ్చేవాడు. మిఠాయి కొనిపెట్టేవాడు ఆ పిల్ల వాడిని ఆదరంగా చూస్తుందని అనుకున్నాం. ఒకరోజు వాడికి అన్నం పెట్టమంటే ఆవిడ అలిగి కూర్చుంది. వాడేదో ఆమెను అగౌరవం చేస్తున్నాడట. వాడి దృష్టిలో ఆ పిల్ల ఇంకా గౌను తొడుక్కొని ఆడుకున్నట్లే ఉంది. చనువుగా పిలిచితే తప్పు పట్టుకుంది. ఆ రాత్రి ఆమెను ఒక దారికి తీసుకొచ్చేసరికి ప్రళయమయింది. వాడికి కూడా బోధించవలసి వచ్చింది.

ఈ గాయం పూర్తిగా మానకుండానే మరో సంఘటన జరిగింది. ఎంతకాలం నుంచో మా యింటికి రానట్టి దూరపు బంధువు, రామ్‌లాల్‌ని తీసుకొచ్చిన పెద్ద మనిషి, ఒక సాయంకాలం వచ్చి పడ్డాడు కొత్తకోడలికి అతను మరీ దగ్గిర చుట్టం. వచ్చిన దగ్గిరనుంచీ ఆవిడ గుడ్డివాడికి చాకిరీ చేయలేక నానా బాధలు పడుతున్నట్లు తేల్చింది. అతనో చిన్న సలహా చెప్పాడు. రామ్‌లాల్‌కి, వీధిలో పోయేవాళ్ళకి స్పష్టంగా వినిపించినట్లు చెప్పాడు

"వీడికి చాకిరీ చెయ్యడం కష్టం. మగాళ్ళకేం. ఎవరికి తోచినట్లు వారు చెప్తారు. పనిచెయ్యడం మాత్రం ఆడవాళ్ళమీద పడుతుంది. నెలకి పాతికో ముప్పయ్యో పారేస్తే చాలు... వాళ్లున్నారే. ఆ సమాజంవాళ్లు .... వాళ్ళు తప్పకుండా అన్ని సదుపాయాలు చేస్తారు. క్రైరాతీ సత్రం బాగానే ఉంటుంది. అక్కడికి పంపించివేయండి. అనుభవంమీద చెప్తున్నాను."

అతనికి ఇటువంటి విషయాలలో ఎంతవరకు అనుభవముందో తెలియదు. ఈ ముందాలోచనతోనే ఆయన రామ్‌లాల్‌ని ఇంటిగుమ్మం కూడా తొక్కకుండా పంపించాడు. కళ్ళుపోయిన తర్వాత ఏదో పంచలో తల దాచుకున్నవాడిపై ఈ విధంగా ఆయన కత్తులు దూశాడు. క్రైరాతీ సత్రంనిండా




కుష్టురోగులు, వికలాంగులు...వాళ్ళతో ఈ రామ్‌లాల్! .. ఏదో తలకొట్టి నట్లయింది.

ఆ రాత్రి వాడు అన్నం తినలేదు. నా భార్యే వడ్డించింది. బతిమాలింది ఒక్క మెతుకయినా వాడు ముట్టుకోలేదు. వర్షానికీ చలికి అడ్డుకట్టిన తడక ఎత్తివేసి అరుగుపంచున కూచున్నాడు. అందరూ నిద్రపోయిన తర్వాత నేనే వాడిని పలకరించాను

"రామ్‌లాల్! భోజనం మానేశావేమి?"

"బాబుగారి మాటలు విన్న తరువాత ఏం తిండి తినగలను?"

"అటువంటి మాటలు పట్టించుకోకూడదు."

"నేనూ అలాగే అనుకున్నాను. కాని మనసు చాల దుర్బలమైనది. ఏదో కీడు శంకిస్తుంది. కుండెడు పాలలో బాబుగారు మజ్జిగచుక్క కాదు వేసినది. కాలకూట విషం ఒక చుక్క చాలు...."

తనకు తోచిన సలహా ఉచితంగా ఇచ్చాడాయన. నేను, నా భార్య దానిని పాటించవలసినవాళ్ళమేనా?.... నీకు మామీద కూడా విశ్వాసం తగ్గిపోయిందా!"

వాడు మాట్లాడలేదు. కళ్ళు తుడుచుకుంటున్నాడు.

"బాబా! ఆకలిగా ఉంది. కొంచెం మజ్జిగ తాగడానికియ్యి...."

ఇళ్ళు మారిపోయాం. ఉద్యోగంలో మార్పులు వచ్చాయి. రామ్‌లాల్ మాతోనే ఉన్నాడు.

అనుకోకుండా విదేశాలకు పంపించారు నన్ను. వెళ్ళేటప్పుడు అందరితో చెప్పినట్లుకాకుండా, నా భార్యను దగ్గిర పెట్టి, వాడికి ఏ విధమైన ఇబ్బంది

కలుగకుండా నేను చేసిన ఏర్పాటులన్నీ చెప్పి దేశం విడిచి వెళ్ళిపోయాను.


*    *    *

బొంబాయి సాంతాక్రూజ్ విమానాశ్రయంలో పగలు పదకొండు గంటలకి దిగవలసిన విమానం ఒక గంట ముందుగా చేరుకుంది. కస్టమ్సు నుండి బయటికి వచ్చేసరికి టెలిగ్రాము ఒకటి అందింది. అనుకున్న ప్రకారం బొంబాయి రావడంలేదని నా భార్య ఇచ్చింది. విక్టోరియా స్టేషనులో ఒక స్నేహితుడికి సామాను అప్పజెప్పి మెరైన్‌డ్రైవ్‌లో ఒకరిని కలియడానికి వెళ్ళిపోయాను. అక్కడ కొంచెం ఆలస్యమయి, రైలు పది నిమిషాలలో విడిచిపెడ్తుందనగా స్టేషను చేరుకున్నాను రిజర్వేషను చూచుకొని కంపార్టుమెంటుకి పరుగెత్తాను.

నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను. చంటిపిల్లను ఎత్తుకొని నా భార్య బెర్తు మీద కూచుంది. పెద్ద పిల్లలిద్దరూ ఆమె పక్కను కూర్చున్నారు. చంటిపిల్లకు జ్వరంగా ఉండడం నుంచి ఆ విధంగా టెలిగ్రాము ఇచ్చిన మాట నిజమే. మరునాటికి జ్వరం తగ్గి, పిల్ల ఆడుకోడం మొదలుపెట్టగానే మళ్ళా అనుకున్న ప్రకారం ప్రయాణం సాగించింది. కాని ఆవిడ యిచ్చిన రెండవ టెలిగ్రాము నాకు అందలేదు.

ఏదో ఆనందం .... ఆరు నెలల తరువాత పిల్లలను, భార్యను అనుకోకుండా చూచి ఆనందించాను. వాళ్ళకూ అంతే. అనుకున్న ప్రకారమే పొద్దున్న మెయిలు దిగి, వెయిటింగ్ రూంలో కూర్చున్నారు. అక్కడ నేను వాళ్ళను కలుస్తానన్నాను. బొంబాయి చూపిస్తానన్నాను నేను ఎంతకీ రాకపోతే ఎయిరోడ్రోమ్‌కి ఫోను చేశారు. కాని నేను వచ్చింది లేనిది తెలియలేదు. ఆందోళనతో వాళ్ళు తిన్నగా సాయంకాలం తిరిగి వెళ్ళిపోడానికి మెయిలు దగ్గరికి వచ్చారు. ప్లాట్‌ఫారంమీద నా స్నేహితుడిదగ్గరనున్న సూట్‌కేసును మా పెద్దపిల్ల గుర్తుపట్టింది. దానినిండా దేశదేశాల టాగ్‌లు ఉన్నాయి. నా పేరుంది. అప్పటివరకు పచ్చిమంచినీళ్ళు అయినా తాగని నా భార్య, దిగులుతో కుంగిపోయిన పిల్లలు తేరుకున్నారు. వాళ్ళు టిఫిన్ తిని, నాకోసం ఫ్లాస్కులో పాలుపోయించుకొని కంపార్టుమెంటులో కూచున్నారు.

విదేశాల వింతలు చెప్పడంతో రైలులో కాలం గడిచిపోయింది. ఇల్లు చేరిన రెండు మూడు రోజులవరకు ఎడతెరిపిలేకుండా బంధువులు, స్నేహితులు రావడం, నేను తెచ్చిన వస్తువులు చూపించడం, వాళ్ళ ప్రశ్నలకు జవాబు చెప్పడంతో తీరుబడి లేకపోయింది. నాలుగో రోజున కాబోలు ...బాగా చీకటి బడ్డ తరువాత ఇల్లు చేరుకున్నాను.



భోజనం చేసి, పడకగదిలో కూర్చొని ఉత్తరాలు రాసుకుంటున్నాను. నా భార్య వంటింటి పని ముగించుకొని వచ్చింది. ఎప్పటిదో అలవాటు....మామూలుగా నా భార్యను ప్రశ్నించాను..."రామ్‌లాల్‌కి భోజనం పెట్టడమయిందా?"

ఆమె ముఖం ఒక్కసారి చీకటి కమ్మినట్లయింది పక్కనే ఉన్న కుర్చీ మీద కూచుంది కళ్ళంట నీరు కారుతున్నది. తరచి తరచి అడిగితే తేలిన సారాంశమిది.

వారం వారం నేను విదేశాలనుండి రాసిన ఉత్తరాలు నా భార్య చదివి వినిపించడం, మావాళ్ళందరూ వినడం

జరుగుతుండేది. రాత్రి భోజనం వేళ రామ్‌లాల్ కూడా నా భార్యని అడిగే వాడు. సంగతులు చెప్తే శ్రద్ధగా వినేవాడు.

న్యూయార్కు నుంచి నేను రాసిన ఉత్తరం చదివిన తరువాత మా తమ్ముడి భార్య ముక్కుమీద వేలువేసుకుంది. ఏమిటి విన్నదో, ఏమిటి అర్థంచేసు కుందో_అంతవరకు రామ్‌లాల్‌కి భోజనం పెట్టడానికి విముఖురాలైన మనిషి తానుగా ఆరాత్రి తొందరపడింది.

వాడు మామూలుగా ప్రశ్న వేశాడు.

"బాబా ఉత్తరం రాశాడా?"

"ఓ రాశాడు!"

"సంగతు లేమిటి?"

"అందులో అంతా నీ గురించే."

"ఏమిటేమిటి?"

"నీకోసం ఓ పెద్దకుక్కను సంపాదిస్తున్నాడాయన దాని మెడకో గొలుసు కట్టి నీచేతి కిస్తాడు. అది పట్టుకొని నువ్వు వీధులంట షికార్లు తిరగొచ్చు."

"నాకేం బోధపడడం లేదు....మరో సారి చెప్పు, చిన్నమ్మా!"

"నీ పుట్టిబుద్ధి కేంబోధపడ తుంది. నీ మెడలో ఒక అట్ట_దానిమీద ఏమిటి రాస్తారో ఆలోచించు ..."

"నాకు తెలియదు."

"'నేను గుడ్డివాడిని. ధర్మంచెయ్యండి' అని రాస్తారు. నీ చేతిలో ఒక డబ్బుల డబ్బా. వీధిలో పోయేవాళ్ళు కానీ, పరక అందులో వేస్తే నువ్వు యింటికి తెచ్చి ఇవ్వాలి."

"నిజంగా ఇవన్నీ బాబా రాశాడా?"

"నే నేం చెప్పినా నీకు నమ్మకం లేదుగా. మా తోటికోడల్నే అడుగు. కుక్క సంగతి రాశారా లేదా అని. అప్పుడే నీకు బోధపడుతుంది."

"బాబా ఇటువంటి పనిచేస్తాడా!"

"అదంతా విదేశాల మహిమ."

"అడుక్కోడం కూడా ఆర్జనేనా?"

"ఆ సంగతి అతగాడినే అడుగు."

రామ్‌లాల్ నా భార్యని ఏమీ అడగ లేదు. ఆమె చెప్పినది విన్నా, తనకు తోచినట్లుగా అన్వయించుకున్నాడు. అంతే....తిండితిప్పలు క్రమంగా మానే శాడు_వారం రోజులలో చనిపోయాడు.

నా భార్య ఏడుస్తున్నది.

"వాడికేం లోటు చెయ్యలేదు. నా పిల్లలకన్న వాడిని హెచ్చుగా చూచు కున్నాను కాని ఏంప్రయోజనం! మాట దక్కలేదు. మీ స్నేహితులందరూ వచ్చారు. బ్రహ్మరథం పట్టారు. ఇటు వంటి విషయాలు రాయకూడదని ఎవరో అన్నారు. అందుచేత మీకు తెలియజేయ లేదు."

అప్రయత్నంగా నా కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి.

వాడు ఎప్పుడో చెప్పిన మాట జ్ఞాపకం వచ్చింది.

కుండెడు పాలలో కలిపినది మజ్జిగ చుక్క కాదు. అది విషబిందువు.

———